ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ నేత, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వల్భాపూర్ గ్రామంలో 'పల్లెపల్లెకు ప్రవీణన్న.. గడప గడపకు కాంగ్రెస్' నినాదంతో సోమవారం చేపట్టిన పర్యటనలో ఆయన ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. తొలుత గ్రామ కూడలిలో పార్టీ జెండాను ప్రవీణ్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయని చెప్పారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇతర హామీలు నెరవేర్చలేదని తెలిపారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ఎన్నికల మేనిఫెస్టో అమలుకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసపూరిత ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రత్నాకర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, గూటం జోగిరెడ్డి, చల్లా మల్లారెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, కదారి రాజేందర్, తంగెళ్లపల్లి కొమురయ్య, కట్కూరి గౌతమ్, అంబాల ఉపేందర్, దాట్ల రాముడు, బత్తిని రవి, తాళ్ళపెల్లి తిరుపతి, పెండ్యాల తిరుపతి, మొలుగూరి భాస్కర్, బచ్చు బాబురావు, రావుల రామేష్, మంద సుమన్‌గౌడ్, మంద రాజయ్య, ముప్పు శ్రీనివాస్, దాట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడితో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్(వేలేరు) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని గొల్లకిష్టంపల్లిలో సోమవారం నూతన జీపీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పల్లెప్రగతి ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో నర్సరీ, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం వంటి మౌలిక సదుపాయాలతోపాటు ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ వంటి సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జానీ, సర్పంచ్ సందెల పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


జీపీ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

తహసీల్దార్‌ను కలిసిన సర్పంచ్

శాయంపేట : తహసీల్దార్ సుభాషిణిని పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు బండ జయపాల్‌రెడ్డి, గంట శ్యామ్‌సుందర్‌రెడ్డి, పసుల ప్రవీణ్ ఉన్నారు.



గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై సర్వే

పరకాల : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గృహలక్ష్మి దరఖాస్తులను అధికారులు, సిబ్బంది బృందాలు సోమవారం సర్వే చేశాయి. ఈనెల 25లోపు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి వార్డుల వారీగా మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలనకు చర్యలు చేపట్టారు.

పారదర్శకత పాటించాలి

కమలాపూర్ : గృహలక్ష్మి పథకం సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ పల్లవి సూచించారు. మండలంలోని శనిగరం గ్రామంలో చేపట్టిన సర్వేను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హులకు అన్యాయం జరుగకుండా సర్వే చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.


కమలాపూర్ : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రేపటి నుంచి నిరవధిక సమ్మె


డాక్టర్ సాయికృష్ణకు సమ్మె నోటీసు అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

శాయంపేట : ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సెకండ్ ఏఎన్‌ఎంలు తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణకు సోమవారం వారు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. గత నెలలో సమ్మె చేపట్టి ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా స్పందించకపోవడంతో నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు సాంబలక్ష్మీ, శ్రావణి, మమత, రజిని, నిర్మల, సునీత, స్వరూప పాల్గొన్నారు.

చేనేత రంగానికి చేయూతనివ్వాలి

శాయంపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగిస్తూ చేయూతనివ్వాలని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ కోరారు. చేనేత వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని చేనేత సొసైటీని ఆ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం సందర్శించారు. వస్త్ర ఉత్పత్తిని తిలకించారు. నూలు దారం నుంచి వస్త్రాల తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం చేనేత సొసైటీ నుంచి బస్టాండ్ జంక్షన్ వరకు 'చేనేత వస్త్రాలను ధరించాలని, పరిశ్రమలను కాపాడాలని' కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. చేనేత వస్త్రాలకు ధర అధికంగా ఉండడం, మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతో కార్మికులకు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్, ఓదెలు, రవికుమార్, అనిల్‌కుమార్, రాజయ్య, అశోక్‌కుమార్, అరుణ, ఇందిర, సుసిత, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కోఆప్షన్ సభ్యుడికి పరామర్శ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజా హసనొద్దీన్‌ను అతడి భార్య షెహనాజ్ బేగం ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ యువ నాయకుడు వొడితెల ప్రణవ్ సోమవారం పరామర్శించారు. షెహనాజ్ బేగం మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల రాజు, నాయకులు మొండెద్దుల రాజమౌళి, సయ్యద్ ముజీబ్ హుస్సేన్, రాంచందర్, మనీష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

సాక్షి నెట్‌వర్క్ : వరంగల్ నగరంలోని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ముట్టడి కార్యక్రమ నేపథ్యంలో పరకాల, శాయంపేట, ధర్మసాగర్, కమలాపూర్, ఐనవోలు, ఆత్మకూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అరెస్ట్‌లను ఖండించారు.



'చర్య తీసుకోండి'

దామెర : తనకు ఆస్తినష్టం కలిగించి రూ.2 లక్షల విలువైన సామగ్రి చోరీ చేసిన వ్యక్తిపై చర్య తీసుకుని తనకు న్యాయం చేయాలని చల్లా శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని ఊరుగొండలో సోమవారం ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 103లోని తన భూమిలోని ప్రహరీని పసరగొండకు చెందిన కొటం ఐలయ్య సుమారు 20 మంది, జేసీబీతో సోమవారం ధ్వంసం చేసి సబ్‌మెర్సిబుల్ కరెంటు మోటర్, పైపులు, రోటోవేటర్, కల్టివేటర్‌లను ఎత్తుకెళ్లారని చెప్పారు. గతంలో ఐలయ్యకు తనకు నడుమ భూవివాదం తలెత్తగా పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని, కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చినా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ వెల్లడించారు.

నిశాంత్ స్మారకంగా సామాజిక సేవలు

కమలాపూర్ : 2007లో అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈటల నిశాంత్ స్మారకంగా సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు నిశాంత్ స్మారక ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఈటల సమ్మన్న తెలిపారు. నిశాంత్ 16వ వర్ధంతి సందర్భంగా నిశాంత్ స్మారక, కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత నిశాంత్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నిశాంత్ స్మారక క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొననున్న 140 మంది క్రీడాకారులకు రూ.75 వేల విలువైన క్రీడాదుస్తులు, పీఈటీలకు విజిల్స్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి టెన్త్, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు రూ.30 వేలు మెరిట్ స్కాలర్‌షిప్, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, పేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం రూ.33 వేలు ఆర్థికసాయం, స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.30 వేలు విలువైన చీరలను నిశాంత్ కుటుంబ సభ్యులతోపాటు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాల్లో రిటైర్డ్ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, ఓఎస్‌డీ డాక్టర్ ప్రసాద్, సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, సహాయ ఐటీ అధికారులు హరి, తిరుపతి, ట్రస్ట్ సభ్యులు దాసి సాంబయ్య, మల్లిఖార్జున్, ఈటల భద్రయ్య, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, ఎంఈఓ రాంకిషన్‌రాజు, హెచ్‌ఎం పవన్, ఎస్ఓ అర్చన, రిటైర్డ్ హెచ్‌ఎం రాంరెడ్డి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు











ప్రకటన

[illegible]

సం/- సి.హెచ్. ఆగారెడ్డి

ప్రకటన

[illegible]

Sd/- CH. AGA REDDY, B.Sc., LL.B. Advocate Notary

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని పత్తిపాక, ప్రగతి సింగారం, కాట్రపల్లి, సాధోనిపల్లి, రాజుపల్లి, జోగంపల్లి గ్రామాల్లో 'ఇంటింటికి సంక్షేమ ఫలాల' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి, సంక్షేమంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పేదలకు పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, తదితర పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. త్వరలో బీసీ కార్పొరేషన్ రుణాలు, గృహలక్ష్మి పథకం అమలు కానుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, జర్పుల మాజీబాయి వెంకట్రాంనాయక్, ఒంటేరు వనమ్మ వీరస్వామి, గజ్జల లావణ్య రాజు, పాడమేకల మమత సంపత్, ఏదుల రమేష్, ఎంపీటీసీ అజ్మీరా ఉమ రఘుసింగ్, మల్లయ్య, ప్రవీణ్‌కుమార్, ఎలీషా, సాంబయ్య, శ్రీనివాస్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి, తదితరులు

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి

పరకాల : నేడు పట్టణంలోని ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. పట్టణంలోని 20వ వార్డులో ప్రజలకు జాతీయ జెండాలను సోమవారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వార్డు కమిటీ అధ్యక్షుడు బొచ్చు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రెండ్ల సమ్మయ్య, యూత్ నాయకులు మునిగంటి విష్ణువర్ధన్, సంపత్, ఆర్పీ.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ మండల కేంద్రంలో ఇంటింటికీ జాతీయ జెండాలను సోమవారం పంపిణీ చేశారు. నేడు ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని ఆమె కోరారు.


పరకాల : జెండాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ అనిత

'ఎంజేపీ' ప్రతిష్టను దిగజార్చొద్దు

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రతిష్టను దిగజార్చొద్దని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి కోరారు. ఆ పాఠశాలలో ఓ విద్యార్థిని మరో విద్యార్థి కొట్టిన ఘటన నేపథ్యంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి స్కూల్‌ను సోమవారం సందర్శించి మాట్లాడారు. బాధిత బాలుడి తల్లిదండ్రులు వచ్చే వరకు ఎందుకు పట్టించుకోలేదని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి మరోసారి పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను సస్పెండ్‌ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు మారెపల్లి మనోజ్, సురేష్ డిమాండ్ చేశారు. ఆ పాఠశాలను సోమవారం వారు సందర్శించి ఘటనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాడని ఆరోపించారు.

విద్యార్థులకు షూ పంపిణీ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్‌లో 65 మంది విద్యార్థులకు స్థానికుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం రవి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పంపించిన షూను ఉపాధ్యాయులతో కలిసి ఎస్‌ఎంసీ చైర్మన్ బండారి సుధాకర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వర్గం రవికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లన్న ఆలయంలో పూజలు

ఐనవోలు : మండల కేంద్రంలోని ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. శ్రీమల్లికార్జునస్వామికి కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, అర్చక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.











